## క్లుప్తంగా

### బూసికి సర్వేపల్లి రాధాకృష్ణ పురస్కారం


బూసి వెంకటస్వామి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ బూసి వెంకటస్వామి సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం వెంకటస్వామి మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత ప్రతిభావంతులైన వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు భాషా సాహిత్యాల్లో కృషి చేసినందుకు ఈ పురస్కారానికి ఎంపికైనట్లు తెలిపారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 31న గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞానమందిర్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ తదితరులు అభినందనలు తెలియజేశారు.

### ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

యలమంచిలి: స్థానిక శ్రీ ఉమాసోమేశ్వర స్వామి ఆలయం నూతన కమిటీ ఆదివారం బాధ్యతలు స్వీకరించింది. కమిటీ చైర్మన్‌గా అడబాల శివన్నారాయణ నియమితులు కాగా మరొక తొమ్మిది మంది ట్రస్ట్ బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరందరితో ఆలయ కార్యనిర్వహణాధికారి నామా ల సతీష్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు.

### ఘనంగా లయన్స్ జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న జిల్లా లయన్స్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: లయన్స్ క్లబ్ జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం స్థానిక అడబాల గార్డెన్స్‌లో నిర్వహించారు. జిల్లా గవర్నర్‌గా పాపారావు నాయుడు యూఎస్ఏలో జరిగిన సమావేశంలో ప్రమాణ స్వీకారం చేయగా, కమిటీ సభ్యులు ఫస్ట్ గవర్నర్‌గా డాక్టర్ డి.సుబ్బారావు, సెకండ్ గవర్నర్‌గా ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు, జిల్లా కేబినెట్ సెక్రటరీగా శిఖాకొల్లు కామేశ్వరరావు, కోశాధికారిగా కారుమూరి రామలింగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ముచ్చర్ల సత్యనారాయణ ప్రస్తుతం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ లయన్స్ అందించే సేవలు అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ పర్వతనేని సుభాష్ బాబు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: పేకాట ఆడుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జగన్నాథపురం శివారు చెరువు సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం రాత్రి రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.9,020 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై ప్రసాద్ వివరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### యువకుడి అదృశ్యంపై కేసు

అత్తిలి: మండలంలోని మంచిలి గ్రామానికి చెందిన ఉద్దరాజు ఫణి దుర్గా ప్రసాద్ అనే యువకుడు గత నెల 30 నుంచి కనిపించడం లేదనే ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.ప్రేమ్‌రాజు తెలిపారు. ఫణి దుర్గా ప్రసాద్ చేపల చెరువు వద్ద పని చేసే వాడని గత నెల 30న పనికి వెళ్లి రాలేదంటూ దుర్గా ప్రసాద్ తల్లి రాధాకుమారి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### హమాలీ కార్మికులపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

భీమవరం: హమాలీ కార్మికులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి విడనాడి సమగ్ర కార్మిక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భీమవరం బజార్ లాగుడు బండ్ల ముఠా కార్మిక సంఘం 29వ మహాసభ భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో యూనియన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో బలరాం మాట్లాడుతూ హమాలీ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన ఉద్యోగ కార్మికులకు పని భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు ఐక్య పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని కోరారు. ఈ మహాసభలో యూనియన్ కార్యదర్శి బి వాసుదేవరావు నివేదిక మహాసభలో ప్రవేశపెట్టారు. అనంతరం నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

# శిథిల వంతెనలతో భయం భయం

**నరసాపురంలో వంతెనల అభివృద్ధిపై దృష్టి పెట్టని పాలకులు, అధికారులు**

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో కాలువల పై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వంతెనల పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా కూడా మరో వైపు ఆర్అండ్‌బీ అధికారులు వంతెనల పునర్నిర్మాణ విషయంలో దృష్టి పెట్టకపోవడంతో విమర్శలకు తావిస్తోంది. మరోవైపు చాలా ప్రాంతాల్లో కొత్తగా వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉన్నా కూడా అధికారులు ఆ అంశంపై కూడా దృష్టి పెట్టకపోవడం గమనార్హం. నరసాపురం-పాలకొల్లు రోడ్డులో వున్న మత్స్యపురి వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెనకు ఓ వైపు రిటైనింగ్ వాల్ కూలిపోయింది. నిత్యం ఈ వంతెన పై అనేక బస్సులు, లారీలు వెళ్తుంటాయి. మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లాలంటే ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. ఈ వంతెనకు ఎప్పుడో 20 ఏళ్ల క్రితం మాత్రమే మరమ్మతులు చేశారు.


రైల్వే స్టేషన్ రోడ్డులో శిథిలావస్థలో ఉన్న మేదర్ల వంతెన

**ప్రమాదకర స్థితిలో రైల్వే స్టేషన్ రోడ్డు వంతెన**

రైల్వే స్టేషన్ రోడ్డుకు చేరుకోవడానికి ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. మేదర్ల బ్రిడ్జిగా పిలిచే ఈ వంతెన నిర్మించి 50 సంవత్సరాలు అవుతోంది. రైల్వేస్టేషన్ వద్ద నుంచి బైపాస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఇటీవల కాలంలో మేదర్ల బ్రిడ్జి మీదుగా ట్రాఫిక్ భారీగా పెరిగింది. ఈ వంతెనను కొత్తగా నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే రుస్తుంబాద నుంచి మంగళగుంటపాలెం వెళ్లే దారిలో కాలువపై వంతెన కూడా కూలడానికి సిద్ధంగా ఉంది. సుమారు 1500 ఎకరాల ఆయకట్టు రైతులు ప్రతిరోజూ ఈ వంతెన మీదుగా ప్రయాణించాలి. ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న కాలిబాట వంతెన కూడా ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వంతెన యాతనల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

**అభివృద్ధిపై దృష్టి లేదు**



ప్రభుత్వానికి అభివృద్ధిపై దృష్టి ఉండడంలేదు. నరసాపురం పట్టణంలో ప్రధాన వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయి. మత్స్యపురి వంతెనను మరమ్మతులు చేసి 25 ఏళ్లు దాటుతోంది. ఇక రైల్వేస్టేషన్‌కు వెళ్లే మేదర్ల వంతెన పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇటీవల ఈ మార్గంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లే బస్సులు కూడా ఈ మార్గంలోనే వెళుతున్నాయి. కాబట్టి కొత్తగా పెద్దగా ఈ వంతెనను అభివృద్ధి చేయాలి.

– ముచ్చర్ల త్రిమూర్తులు, సీపీఎం పట్టణ కార్యదర్శి

### నేడు సీనియర్ సిటిజన్స్ అష్టావధానం

నరసాపురం: పట్టణంలోని గోదావరిగట్టున ఉన్న అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఓ వినూత్న కార్యక్రమాన్ని నరసాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చేపట్టింది. మొత్తంగా సీనియర్ సిటిజన్స్‌తో అష్టావధానం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉత్సాహవంతులు, తెలుగు భాషాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నరసాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అందే రంగారావు ఆదివారం విలేకరులకు తెలిపారు.

### 29న నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని వివరించారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

యలమంచిలి: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు కోరారు. ఊటాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పింఛన్‌లు సర్వే పేరిట అర్హుల పింఛన్‌లలో కోత విధించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో నాలుగింటిని అరకొరగా అమలు చేస్తుందన్నారు. ఈ వైఫల్యాలన్నింటినీ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా ప్రజలకు వివరించాలని స్టాలిన్‌బాబు కోరారు. అనంతరం గ్రామ కమిటీ, మండల కమిటీ, అనుబంధ కమిటీలు గురించి చర్చించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దొంగ విజయ్ కుమార్, నాయకులు రామేశ్వరపు రఘురామ్, కొక్కిరిగడ్డ రాజేంద్ర, కవురు వీర వెంకట సత్తి బాబు, సరెళ్ల ఆనందరావు, సాదే వసంతరావు, సాదే మనోజ్, దిగమర్తి బుజ్జిబాబు, దీపాటి శ్రీను, విపర్తి రాంబాబు, సరెళ్ల రాజు, కొక్కిరిగడ్డ రాజశేఖర్, సాదే ప్రసాద్, దిగమర్తి సత్యనారాయణ, వీరవల్లి వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఊటాడలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

# ధ్యాన సాధనతో ఆనందమయ జీవితం

పెనుమంట్ర: జ్ఞాన సాధన ద్వారా ఆనందమయ జీవితాన్ని గడపవచ్చునని సీనియర్ పిరమిడ్ మాస్టర్ నాగ రమాదేవి అన్నారు. పెనుమంట్ర గ్రామ ఉప సర్పంచ్ భూపతి రాజు శ్రీనివాస్ రాజు ఆధ్వర్యంలో పిరమిడ్ కేంద్రంలో ఆదివారం ఉచిత జ్ఞాన శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగ రమ దేవి మాట్లాడుతూ సంకల్పం అంటే మన ధృఢమైన ఆలోచననేనని ధ్యానం ద్వారా అద్భుతమైన ఆలోచనలు చేయగలమని తద్వారా మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవచ్చునున్నారు. ఈ సందర్భంగా జ్ఞాన బోధ చేసి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, భూపతిరాజు శ్రీనివాసరాజు రాధా, ఎం.లక్ష్మి, ఇందిరా భవాని, నాగ ధనలక్ష్మి, పడాల సూర్యనారాయణ రెడ్డి, పార్వతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.


ఉచిత ధ్యాన శిక్షణ ఇస్తున్న దృశ్యం

# మదర్‌థెరిస్సా పురస్కారాల అందజేత


పురస్కారం అందుకుంటున్న జోగాడ


గవాస్కర్‌కు జాతీయ ప్రతిభ పురస్కారం అందజేస్తున్న మదర్‌థెరీసా సొసైటీ అధ్యక్షులు డాక్టర్ దిడ్ల కిషోర్

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన రాహుల్ సామాజిక సేవా సంస్థ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జోగాడ ఉమామహేశ్వరరావు మదర్ థెరిస్సా జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం కోనసీమ జిల్లా రావులపాలెంలో సీఆర్‌సీ ఏసీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అందించి ఈ పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

**గవాస్కర్‌కు జాతీయ ప్రతిభ పురస్కారం**

యలమంచిలి: నారినమెరక పంచాయతీ గమళ్లపేటకు చెందిన జై భీమ్ యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గెద్దం సునీల్ గవాస్కర్‌కు మదర్ థెరీసా ఎడ్యుకేషన్ సొసైటీ జాతీయ ప్రతిభ పురస్కారం అందజేసింది. రావులపాలెంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ఫంక్షన్‌లో మదర్‌థెరీసా సొసైటీ అధ్యక్షులు డాక్టర్ దిడ్ల కిషోర్ అవార్డు అందజేశారు.

# ఆదర్శ లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట

ఆకివీడు: స్థానిక ఆదర్శ లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట పండింది. పాలకొల్లులో ఆదివారం జరిగిన రీజనల్ సమావేశంలో జిల్లా స్థాయి లయన్స్‌క్లబ్‌లకు అవార్డులు ప్రదానం చేశారు. వాటిలో ఆకివీడు ఆదర్శ లయన్స్‌క్లబ్ పది అవార్డులను కైవశం చేసుకుంది. ఉత్తమ రూరల్ క్లబ్‌గానూ, ఉత్తమ అధ్యక్షురాలుగా విశ్రాంతి ఉత్తమ ఉపాధ్యాయురాలు కాకర రాజరాజేశ్వరి, ఉత్తమ కార్యదర్శిగా వైఎస్సార్‌సీపీ నాయకురాలు మోరా జ్యోతిరెడ్డి అవార్డుల్ని కైవశం చేసుకున్నారు. ఉత్తమ సిగ్నేచర్ ప్రాజెక్టు, ఉత్తమ అన్నదాన కార్యక్రమం, ఉత్తమ కంట్రీబ్యూషన్, హంగర్ రిలీఫ్, ప్రశంసలు తదితర అవార్డులు లభించాయని కార్యదర్శి జ్యోతిరెడ్డి చెప్పారు.



పాలకొల్లులో అవార్డు అందుంకుంటున్న ఆకివీడు ఆదర్శ క్లబ్ సభ్యులు

# బార్ల దరఖాస్తుకు 26 తుది గడువు

తణుకు అర్బన్: తణుకు పట్టణంలో బార్ల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకునే ఔత్సాహిక దరఖాస్తుదారులకు ఈ నెల 26వ తేదీ తుది గడువని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయదలచిన వారు చివరి రోజు రద్దీ దృష్ట్యా సోమవారం డీడీలు తీసి ఉంచుకోవాల్సిందిగా సూచించారు. నాన్ రిఫండబుల్ ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు, అప్లికేషన్ ఫీజు రూ.5 లక్షలు ఎక్సైజ్ శాఖ సూచించిన బ్యాంకుల్లో డీడీలు తీసి సిద్ధంగా ఉంచుకోవాలని, సందేహాల నివృత్తికి తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 94409 02436 నంబరులో సంప్రదించాలని కోరారు.

# వైఎస్సార్ సీపీ పోరాటం.. ప్రజాపక్షం

**పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు**

భీమవరం అర్బన్: ప్రజల తరుపున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తోందని, చంద్రబాబు మోసపూరిత పాలనను కలిసికట్టుగా ఎండగడదామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని గొల్లవానితిప్ప, యనమదుర్రు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో గ్రామ స్థాయి విస్తృత స్థాయి సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చినిమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ పేదలను గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు. కానీ చంద్రబాబు మోసపూరిత మాటలతో మభ్యపెట్టి ప్రజలు మరోసారి మోసం అధికారం కైవసం చేసుకున్నాడని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామిలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చానిర, కానీ ఎంతమందికి గ్యాస్ సిలిండర్ల డబ్బులు జమ అయ్యాయో, తల్లికి వందనం ఎంతమంది అందిందో, ఉచిత బస్సు పేరుతో ఎన్ని బస్సులు తిప్పుతున్నారో రాష్ట్ర ప్రజలకు తెలుసని అందుకే ఏడాది పాలనలోనే అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత మూటగట్టుకున్నారన్నారు.


గొల్లవానితిప్పలో మాట్లాడుతున్న చినిమిల్లి వెంకటరాయుడు

**అండగా ఉంటాం**

నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతుందని ఎదురించిన వారిని జైల్లో పెడుతున్నారని, ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చంద్రబాబు మోసం పూరిత పాలనను ఇంటింటికి వెళ్లి వివరిద్దామన్నారు. పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శివులూరి దత్తాత్రేయ వర్మ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసే బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. అనంతరం గ్రామ కమిటీలను నియమించి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, మండల అధ్యక్షుడు జల్లా కొండయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏఎస్ రాజు, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, మాజీ సర్పంచ్ బోకూరి విజయరాజు, మాజీ ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, మాజీ ఎంపీటీసీ పెనుమాల నరసింహస్వామి, కొప్పర్తి రాంబాబు, బేతాళ సంతోష్, కొల్లి పెద్దిరాజు, గుద్దటి రామాంజనేయులు, సాదే నాగరాజు, మల్లాడి నారాయణ రావు, బద్దా శాంతారామ్, మెల్లా రాంబాబు, కట్టూరి యోషయ్య, తులా రాంబాబు, గూడపాటి ప్రశాంతి, గెద్దం నరేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొన్నారు.

### ఇంటింటికీ ఉచిత వైద్యం

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటింటికీ ఉచిత వైద్యం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు వైద్యసేవలందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ప్రత్యేక వాహనం ద్వారా ఐదుగురు రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. దాత కాకరపర్తి సత్యవతి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# పంట కాలువలోకి ఆక్వా వ్యర్థాలు

ఉండి: చేపల చెరువుల్లోని వ్యర్థాలను పంట కాలువలోకి విడుదల చేస్తూ కొందరు ఆక్వా రైతులు ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. అధికారుల పర్యవేక్షణా లోపం కూడా ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఉండి నియోజకవర్గంలోని ఎన్నో చెరువులకు ఈరోజుకు కూడా అనుమతులు లేకపోవడం గమనార్హం. కొన్ని చెరువులకు అనుమతులు ఉన్నా అవన్నీ అక్రమ అనుమతులే. ఎందుకంటే చెరువు తవ్వుకోవడానికి ముఖ్యంగా ఇన్‌లెట్ (చెరువులోని నీరువెళ్లే సదుపాయం), అవుట్‌లెట్ (చెరువులోని వ్యర్థాలను బయటకు విడుదల చేసేందుకు సదుపాయం) చాలా అవసరం. కానీ వాటిని అధికారులు పట్టించుకోకుండా చెరువులోకి నీరు వెళ్లేందుకు అవకాశం ఉంటే చాలు అన్నట్లు అనుమతులు ఇచ్చేశారు. అయితే సదరు ఆక్వారైతులు తమ చెరువుల్లోని వ్యర్థాలను నేరుగా పంటకాలువల్లోకి తోడేస్తున్నారు. ఆక్వా చెరువుల్లో వాడే రసాయనాలు నేరుగా పంట కాలువల్లోకి ఆపై ఆయా పంచాయతీల్లోని రక్షిత మంచినీటి చెరువుల్లోకి చేరి ఆ నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఆరేడులో ఆక్వా చెరువులోని వ్యర్థాలను నేరుగా పంటకాలువలోకి తోడేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఆక్వా వ్యర్థాలు తోడేస్తున్న దృశ్యం

# మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలి


మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న టూటౌన్ సీఐ జి.కాళీచరణ్


మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని మైత్రి కాలనీస్ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక ప్రతిమలు, వ్రత పూజ పుస్తకాలను ఎమ్మెల్యే అంజిబాబు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టితో తయారు చేసిన వినాయకులతో పర్యావరణానికి ఎంతో మేలని, ప్రజలందరూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా కెమికల్స్ లేని మట్టి వినాయకులను ప్రతిష్ఠించి, పూజించాలని సూచించారు.

**మట్టి విగ్రహాల పంపిణీ**

భీమవరం: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని ఇళ్లల్లో, బహిరంగం వేదికల్లో జరిగే ఉత్సవాల్లో మట్టి వినాయకుని ప్రతిమలను పూజించాలని టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సీఐ చేతుల మీదుగా మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ జి.కాళీచరణ్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన పెద్ద పెద్ద విగ్రహాలతో జల కాలుష్యమై అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. నిర్వాహకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ మానవత సంస్థ గౌరవ డైరెక్టర్ పెన్మెత్స రామ్మోహన వర్మ (పూనా రాము) సౌజన్యంతో 200 మందికి ఉచితంగా వినాయక ప్రతిమలను పంపిణీ చేసినట్లు చెప్పారు. టూటౌన్ ఎస్సై రామారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**చిన్నారులకు వినాయక ప్రతిమల పంపిణీ**

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను పూజించాలని మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ అన్నారు. భీమవరం మెంటేవారి తోటలో ఆదివారం భగవద్గీత శిక్షణ పొందుతున్న 108 మంది చిన్నారులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా అందరూ మట్టి గణపతులను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో చిన్నారులు మహిళలు పాల్గొన్నారు.

### పెద్దింటి అమ్మవారికి నల్లపూసల గొలుసు

ఆకివీడు: ఆకివీడు గ్రామ దేవత పెద్దింటి అమ్మవారికి రూ.1.30 లక్షల విలువైన 12 గ్రాముల బంగారు నల్లపూసల గొలుసును స్థానిక సంతపేటకు చెందిన నెల్లి దుర్గారావు కుమారుడు వీర కుమార్, ఉమామహేశ్వరి దంపతులు సమర్పించారు. ఆలయ చైర్మన్ గొంట్లా గణపతి, ఈఓ అల్లూరి సత్యనారాయణరాజుకు నల్లపూసల గొలుసును అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దాతలను ఆలయ మర్యాదలతో వార్డు కౌన్సిలర్ కె.అరుణ కుమారి నాగరాజు సత్కరించారు.